
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 19 ఫిబ్రవరి 2024 | 5



నేడు జిల్లాస్థాయి 'స్పందన'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 18: జగనన్నకు చెబుదాం.. జిల్లాస్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకార కార్యక్రమం ఈ నెల 19వ తేదీ సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కాకినాడ కలెక్టరేట్ స్పందన హాలులో జరుగుతుందని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు, జిల్లా అధికారులు గమనించాలని కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు.

నీటి గండం!



సామర్లకోట జలాశయంలో అడుగంటిన నీటి నిల్వలు

- గోదావరి కాలువ నుంచి తగ్గిన నీటి విడుదల
- ఇప్పటికే పొలాలకు అందని సాగునీరు
- సామర్లకోట, పెద్దాపురం మున్సిపాల్టీలకు, కాకినాడ కార్పొరేషన్‌కు పొంచి ఉన్న తాగునీటి సమస్య

సామర్లకోట, ఫిబ్రవరి 18: తూర్పుడెల్టా కాలువగా ప్రసిద్ధి పొందిన సామర్లకోట కాలువ పరీవాహక ప్రాంతాల దాళ్వా వరిపొలాలకు సాగునీటి కొరత తీవ్రతరమైంది. చెంతనే గోదావరి కాలువ ప్రవహిస్తున్నా నీటి పారుదల అంతంత మాత్రంగానే ఉండడం కాలువ శివారు పొలాలకు మాత్రమే కాదు కాలువ వెంబడి పొలాలకు నీటి తడులు అందక రైతులు లబోదిబోమంటున్నారు. సామర్లకోట, పెద్దాపురం, కాకినాడ మూడు పట్టణాల ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే రెండు జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. కాలువలో నీటి విడుదల అంతగా లేకపోవడంతో జలాశయాలకు నీటి నిల్వలు పెంచే అవకాశాలు లేకపోయాయి.



సామర్లకోట గోదావరి కాలువకు తగ్గిన నీటి విడుదల

అడుగంటుతున్న నీటి నిల్వలు

సామర్లకోట గోదావరి కాలువలో జలాల విడుదల రెండురోజులుగా మరింత తగ్గడంతో సాగునీటికి శివారు ప్రాంతాల రైతులు ఆందోళన చెందుతుండగా తాగునీటి జలాశయాల్లో నీటినిల్వలు అడుగంటుతున్నాయి. సామర్లకోట, పెద్దాపురం మున్సిపాల్టీల ప్రజలకు తాగునీటి సరఫరా కోసం సామర్లకోటలో వేసవి జలాశయం, మహర్షి సాంబమూర్తి రిజర్వాయర్‌లు ఉండగా మహర్షి సాంబమూర్తి రిజర్వాయర్‌నుంచే కాకినాడ నగరపాలక సంస్థ ప్రజలకు సైతం తాగునీరు సరఫరా చేస్తారు. ఈ జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటుతున్న సమయంలోనే గోదావరి కాలువ నుంచి జలాలను మళ్లించి జలాశయాల్లో నిల్వలు పెంచుతారు. సామర్లకోట గోదావరి కాలువకు రెండురోజులుగా నీటినిల్వలు తగ్గిపోవడంతో సామర్లకోటలో ఉన్న రెండు జలాశయాలకు నీటిని మళ్లించే చర్యలు లేకపోయాయి. దీంతో దైనందిన తాగునీటి పంపిణీకి జలాశయాల్లో నాలుగు అంగుళాలనుంచి ఆరు అంగుళాలమేర నీటి నిల్వలు తగ్గే అవకాశాలు ఉన్నాయి. దీనికి అనుగుణంగా గోదావరి కాలువనుంచి నీటిని మళ్లించకపోతే రానున్న వేసవి కాలంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఎదురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇది ప్రతిఏటా వేసవి సీజన్‌లో ప్రత్యక్షమవుతున్న సమస్యే అయినా అందుకు తగిన రీతిలో అధికారులు స్పందించకపోవడం, ఆ తర్వాత నీటి ఎద్దడితో ప్రత్యామ్నాయ పనులతో ప్రభుత్వ నిధులు దుబారా చేయడం, క్షేత్రస్థాయిలో ప్రజలు తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు.

ముందు చూపు కొరవడే..

గోదావరి కాలువలో పుష్కలంగా నీటి విడుదల ఉన్న సమయంలో సకాలంలో మున్సిపల్ అధికారులకు ముందుచూపు కొరవడడంవల్లే ప్రతిఏటా ఈ అవస్థలు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. గోదావరి కాలువ వెంబడి అనధికార నీటి వినియోగం, అక్రమంగా మోటార్లను ఏర్పాటు చేసుకుంటూ గోదావరి జలాలను అక్రమంగా వినియోగించుకోవడం జరుగుతున్నా వీటిని ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో నిరోధించాల్సిన ఇరిగేషన్ అధికారులు ముడుపుల మాయాజాలంలో మౌనం దాలుస్తున్నారన్న ఆరోపణలు అధికంగా ఉన్నాయి. పరిశ్రమలకు సైతం ప్రస్తుత సమయంలో నీటి వినియోగాన్ని తగ్గించుకోవాల్సిందిగా ఇరిగేషన్ అధికారులు నియంత్రించాల్సి ఉంది. ఆ దిశలో ఇరిగేషన్ అధికారులు ప్రయత్నించిన దాఖలాలు లేవు. దీంతో సామర్లకోట ఎగువ ప్రాంతాలవద్ద కాలువలో నీటి విడుదల తక్కువగా ఉన్న రోజుల్లోను నీటి అక్రమ వినియోగం నియంత్రించలేకపో వడం వల్ల దిగువ ప్రాంతమైన సామర్లకోట, ఉండూరు, వీకే రాయపురం, మాధవపట్నం, బోయినపూడి, పిఠాపురం బ్రాంచి కెనాల్‌లకు చెందిన ఆయకట్టు పొలాలకు దాళ్వా సాగుకు తీవ్రమైన నీటిఎద్దడి నెలకొంది. ఇదే సమయంలో తాగునీటి జలాశయాలకు నీటి మళ్లింపు పూర్తిగా నిలిచిపోయింది. ఈ కారణంగా మరోవారంలో పొలాలకు సాగునీరే కాకుండా సామర్లకోట, పెద్దాపురం మున్సిపాల్టీలకు, కాకినాడ నగరపాలక సంస్థలకు చెందిన ప్రజలు తాగునీటికి అవస్థలు పడక తప్పదని ఆందోళన చెందుతున్నారు.

గోదావరి జలాల విడుదల ఇలా

తూర్పు డెల్టా కాలువగా పిలిచే సామర్లకోట గోదావరి కాలువకు ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ ఉన్నతాధికారులు 2,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రకటించినా 60 కిలోమీటర్ల శివారున ఉన్న సామర్లకోటకు చేరేసరికి 300 క్యూసెక్కుల నీరు కూడా అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు రైతులనుంచి వినవస్తున్నాయి. దీంతో సాగునీటి అవసరాలే అంతంతమాత్రంగా ఉన్న సమయంలో ఇక తాగునీటి మళ్లింపు మరింత కష్టంగా మారనుంది. ఇప్పటికే సామర్లకోట కాలువ పరీవాహక ప్రాంతం పొడవునా ఉన్న ఐదు ఎత్తిపోతల పథకాలకు వంతులవారీ నీటి వినియోగం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇటువంటి విపత్కర సమయంలో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా జిల్లా అధికారులు సామర్లకోట, పెద్దాపురం, కాకినాడ మున్సిపల్ అధికారులకు ఏవిధమైన ఆదేశాలు జారీ చేస్తారో వేచి చూడాల్సిందే.

ఓహెచ్‌ఆర్ ట్యాంకులు అలంకారప్రాయమేనా?



పటవలలో నీరు లీకవుతున్న ఓహెచ్‌ఆర్ ట్యాంక్

- నిర్మించినా ప్రారంభించని వైనం
- కొన్నిచోట్ల మంచినీటి కనెక్షన్లు ఇవ్వలేదు
- పూర్తిస్థాయిలో సరఫరా కాని నీరు

తాళ్లరేవు, ఫిబ్రవరి 18: గ్రామాల్లో ప్రభుత్వం జలజీవన్ మిషన్, ఓఎన్‌జీసీ, సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంకులు అలంకారప్రాయంగా నిలిచాయి. గ్రామాల్లో రూ.22కోట్లతో నిర్మించిన వీటి ద్వారా తాగునీరు అందించాలన్న లక్ష్యం పూర్తి ఫలితాలను ఇవ్వడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఓహెచ్‌ఆర్ ట్యాంకులు అసంపూర్తిగా ఉన్నా హడావిడిగా ప్రారంభోత్సవాలను చేసేసి వదిలేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని కొత్త ట్యాంకులు ప్రారంభమవుతున్నా మరుసటి రోజునుంచే లీకులు అవుతున్నా పట్టించుకునేవారు లేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో వాటరు పైపులైన్లు పూర్తిగా వేయకుండా ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ప్రచారం తప్ప ఎక్కడా కార్యరూపం దాల్చలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఓహెచ్‌ఆర్ ట్యాంకులకు కొత్తపైపులైన్లు వేయకుండా పాత పైపులైన్లకు కనెక్షన్లు ఇస్తున్నట్లు చెప్తున్నారు. రక్షిత నీటి చెరువుల సామర్థ్యం పెంచకుండా అదనంగా ఓహెచ్‌ఆర్ ట్యాంకులు నిర్మించేసినా తాగునీటి సరఫరా ఎప్పటిలాగే ఉంటోందని తప్ప తాగునీటి సమస్య మరింత పెరుగుతోందని ప్రజలు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. నీలపల్లి పంచాయతీ మోకావారిపేటలో ఓహెచ్‌ఆర్ ట్యాంక్ ప్రారంభించినా వాటరు కనెక్షను ఇవ్వలేదు. పటవల బీసీపేటలో ఓహెచ్‌ఆర్ ట్యాంక్ లీకులు ఏర్పడ్డాయి. ప్రతాప్‌నగర్‌లో వాటరు ట్యాంకు నుంచి పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడంలేదు. తాళ్లరేవు మండలంలో 17 గ్రామ పంచాయతీలకు ఒక మంచినీటి చెరువు ఉంటే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం పలకవచ్చని పలువురు పేర్కొంటున్నారు. ప్రతి ఇంటికి పూర్తిస్థాయిలో కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

ఉరుసు ఉత్సవాల్లో వైభవంగా బంగారుపాప గంధోత్సవం

- గంధంకోసం పోటీ పడిన భక్తులు

పొన్నాడ(కొత్తపల్లి), ఫిబ్రవరి 18: బషీర్‌బీబీ 69వ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన గంధోత్సవం వైభవంగా సాగింది. కొత్తపల్లి మండలం మూలపేటకు చెందిన లేట్ షేక్ మౌలానా సాహెబ్ ఇంటినుంచి ఎండీ తాజుద్దీన్‌బాబా సమర్పించిన గంధాన్ని పకీరుమేళా, బిస్మిల్లా నౌబత్ ఖానా పార్టీ ఊరేగింపుతో గుర్రంపై బంగారుపాప ఆలయానికి తీసుకెళ్లారు. దర్గాలో పాతెహకానీ పూర్తికాగానే బంగారుపాప దర్శనానికి విచ్చేసిన హిందూ, ముస్లిం భక్తులకు ముజావర్లు గంధాన్ని పూశారు. గంధంకోసం భక్తులు పోటాపోటీ పడడం గమనార్హం. గంధోత్సవం సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో కొత్తపల్లి ఎస్‌ఐ పీవీ స్వామినాయుడు బందోస్తు చర్యలు చేపట్టారు.



కొత్తపల్లి మండలం మూలపేటనుంచి పొన్నాడ బంగారుపాప దర్గాకు గంధాన్ని తీసుకెళుతున్న ముజావర్లు

నవ దంపతులతో కళకళలాడిన సత్యదేవుడి సన్నిధి

అన్నవరం, ఫిబ్రవరి 18: సత్యదేవుడి సన్నిధి ఆదివారం నవదంపతులతో కళకళలాడింది. శనివారం రత్నగిరిపై వివాహం ఆచరించుకున్న జంటలతోపాటుగా వివిధ ప్రాంతాల్లో ఒక్కటైన నూతన జంటలు స్వామివారి వ్రతమాచరించారు. దీనికితోడు ఆదివారం సెలవుదినం కావడంతో రత్నగిరి రద్దీ నెలకొంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఒక్కరోజు స్వామివారికి వివిధ విభాగాల ద్వారా రూ.40లక్షల ఆదాయం సమకూరింది.



అన్నవరంలో సత్యదేవుడి ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న నవదంపతులు

నేడు పవన్‌కల్యాణ్ రాజమహేంద్రవరం రాక

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సోమవారం రాజమహేంద్రవరం రానున్నారు. విశాఖనుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం ఒంటి గంటకు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని అక్కడినుంచి కారులో రాజమహేంద్రవరం ఏవీ అప్పారావురోడ్‌లోని గెయిల్‌ఆఫీసువద్ద ఉన్న జనసేన కార్యాలయానికి చేరుకుంటారు. రెండు గంటలపాటు ఆయన ఇక్కడే ఉంటారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి ఇన్‌చార్జిలతోను ముఖ్యమైన నేతలతో ఆయన సమావేశమవుతారు. ఇంకా టికెట్లు ఖరారు కాకపోయినా టీడీపీ-జనసేన పొత్తులోకి బీజేపీ కూడా కలుస్తుండడంతో ఆయా సీట్లపై నియోజకవర్గాల ఇన్‌చార్జులకు ఆయన దిశానిర్దేశం చేయవచ్చని పార్టీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది.

వైసీపీనుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

- సూరంపాలెంలో 500మందితో కలిసి పార్టీలో చేరిన వైఎస్ ఎంపీపీ



సూరంపాలెంలో పార్టీలోకి చేరిన వారితో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జ్యోతుల నెహ్రూ

చెందుర్తిలో బోనాల పండుగ

- కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్టకు తరలివచ్చిన మహిళలు



గొల్లప్రోలు మండలం చెందుర్తి జంక్షన్‌లో కనకదుర్గమ్మ ఆలయానికి బోనాలతో వస్తున్న మహిళలు

పిఠాపురంలో సూర్య నమస్కారాల పోటీలు

- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

పిఠాపురం, ఫిబ్రవరి 18: పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండువద్ద గల ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం సూర్యనమస్కారాల పోటీలు నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ సేవాభారతి ఆధ్వర్యంలో జరిగిన సామూహిక సూర్యనమస్కారాల ప్రదర్శన, పోటీలకు పిఠాపురం, పరిసర గ్రామాలనుంచి 28కిపైగా కళాశాలలు, పాఠశాలలకు చెందిన 600మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. రథసప్తమి సంప్రదాయాల పరిరక్షణల్లో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేయగా, పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. పిల్లల్లో శారీరక, మానసిక వికాసానికి యోగాసనాలు ఉపయోగపడతాయని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ జోగా వీరబాలాజీ, జిల్లా ఖజానా కార్యాలయం ఎస్‌టీవో కర్రి సూర్యప్రకాశరావు, దంత వైద్యుడు డాక్టర్ పి.జైపాల్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ కార్యవాహ సత్యరామచంద్రరావు, సూర్యరాయ గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, పిఠాపురం ఖండ సహ కార్యవాహ గట్టి అశోక్, పెద్దాపురం విభాగ్ ఉపాధ్యాయ ప్రముఖ్ మురమళ్ల శివయ్య, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పిఠాపురంలో సామూహిక సూర్యనమస్కారాల ప్రదర్శన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కష్టం రైతుది.. లాభం దళారులది..



- మిర్చి రైతులను అడ్డంగా దోచుకుంటున్న వ్యాపారులు
- క్వింటా రైతుకు రూ.13వేలే.. హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.20వేలపైనే..
- లక్షలు వెనకేస్తున్న దళారులు

గండేపల్లి, ఫిబ్రవరి 18: మొక్క నాటినప్పటి నుంచి అహర్నిశలు కష్టపడి కంటికి రెప్పలా కాపాడిన రైతుకు నష్టాలే మిగులుతున్నాయి. దళారులు,వ్యాపారులు మాత్రం మిర్చి రైతును అడ్డంగా దోచేస్తున్నారు. ఈ సంవత్సరం మిర్చి పంట పొలంలో ఉన్న సమయంలో కురిసిన వర్షాలకు పంట అక్కడక్కడా తెలుపురంగు కాయ రావడంతో పంట నాణ్యతలేదంటూ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గిస్తున్నారు. క్వింటా మిర్చి రైతుకు రూ.13వేలే వస్తుండగా హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.20వేలపైనే పడుతోంది. గతేడాది రూ.200 నుంచి రూ.220 రైతు దగ్గర కొన్న మిరపకాయల ధర ఈ సంవత్సరం నాణ్యత లేదనే సాకుతో కిలో రూ.130 నుంచి రూ.135కే కొనుగోలు చేస్తున్నారు. ఇదే మిరపను బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.200కు పైగా విక్రయాలు చేస్తూ ఒక్కో కిలోకి రూ.60 లాభాలు వేసుకుని లక్షల రూపాయలు వెనకేసుకుంటున్నారు. రైతులకు వేరే మార్గం లేక వారికే విక్రయాలు చేసే పరిస్థితి ఏర్పడింది. దీంతో అహర్నిశలు కష్టపడిన రైతుకు నష్టాలే మిగలడంతో అప్పుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లాలో అత్యధికంగా 350 ఎకరాలకు పైగానే ఈ మిర్చిని రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం కూడా రైతుకు అనుకూలించలేదు. ఈ వర్షాల ప్రభావంతో ఎకరానికి 15 క్వింటాలు దిగుబడి రావాల్సింది. 6నుంచి 7 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చిందని రైతులు అంటున్నారు.

యర్రవరంలో వింత జంతువు మృతి



యర్రవరంలో మృతి చెందిన వింత జంతువు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 18: ఏలేశ్వరం మండలం కొత్త యర్రవరం గ్రామంలో ఆదివారం ఓ వింత జంతువు మృతిచెంది కనిపించింది. యర్రవరం ఐఓసీ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న పుంతలో ఒక రైతుకు చెందిన అరటితోటలో ఈ జంతువు మృతి చెంది పడి ఉంది. బావురుపిల్లి తరహాలో ఉన్న ఈ జంతువు నక్కను పోలి ఉంది. ఈ అరుదైన జంతువును తామెప్పుడూ చూడలేదని గ్రామస్తులు తెలిపారు. ఈ జంతువుపై కుక్కలు, ఇతర జంతువులు దాడి చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

పెళ్లికారును ఢీకొన్న లారీ

- విశాఖకు చెందిన దంపతులకు గాయాలు
- తుని మండలం తేటగుంట వద్ద ఘటన



నుజ్జునుజ్జయిన కారు.. గాయపడిన వధూవరులు

తుని రూరల్, ఫిబ్రవరి 18: తునిలో ఓ పెళ్లికారును ఆదివారం లారీ ఢీకొన్న ఘటనలో కొత్త జంటకు గాయాలయ్యాయి. శనివారం రాత్రి వివాహమైన దంపతులు సత్యనారాయణ స్వామివారి వ్రతం ఆచరించేందుకు విశాఖనుంచి అన్నవరానికి వస్తున్నారు. తుని మండలం తేటగుంట సమీపంలోకి వచ్చేసరికి పెళ్లికారును వెనుకనుంచి ఓ లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు కాగా హైవే సిబ్బంది ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యచికిత్స అందించారు.

అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

చూతము రారండి..



శ్రీలక్ష్మీనరసింహస్వామివారు

- నేడు రాత్రి 12:29 గంటలకు కల్యాణం
- భారీ బందోబస్తు ఏర్పాట్లు

అంతర్వేది, ఫిబ్రవరి 18: బుగ్గన చుక్కతో సిగ్గులు ఒలకపోస్తూ రథసప్తమినాడు పెళ్లి కుమారుడుగా దర్శనమిచ్చిన శ్రీ స్వామివారు సోమవారం రాత్రి ఉభయ దేవేరులను పరిణయమాడేందుకు సిద్ధమయ్యారు. పంచ భూతాల సాక్షిగా అఖండ జన సందోహం నడుమ ప్రతిఏటా మాఘమాసంలో కనుల పండువగా జరిగే శ్రీనారసింహుడి కల్యాణం చూసేందుకు రెండు కళ్లు చాలవు. కోరికలు తీర్చే శ్రీనారసింహుని పరిణయ వేడుక పదిరోజుల పాటు వైభవంగా జరుగుతుంది. ఆరుద్ర నక్షత్రయుక్త వృశ్చికలగ్న పుష్కరాంశమందు సోమవారం రాత్రి 12:29 గంటలకు(తెల్లవారితే మంగళవారం) కల్యాణం జరుగుతుంది.

కల్యాణ తంతు - ఎదురు సన్నాహం..

కల్యాణ కాంతులతో మెరుస్తున్న మేఘ వర్ణుడు శ్రీస్వామివారు. కల్యాణానికి సిద్ధపడుతూ తొలుత కంచు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. తదుపరి పెళ్లి కుమారుడి తరపున ఆలయ అనువంశిక ధర్మకర్త మొగల్తూరు రాజ వంశీయులు, ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహద్దూర్, పెళ్లి కుమార్తె తరపున అర్చక స్వాములు రాజా వారి వీధిలో ఎదురు సన్నాహాలు (ఒకరికొకరు బుక్కా చల్లుకోవడం) చేస్తారు. అనంతరం శ్రీవారి ఆలయం వద్దకు చేరుకుంటారు.

పల్లకీలో కల్యాణ వేడుకకు..

కల్యాణ మూర్తులైన శ్రీ స్వామివారు మేళ తాళాలు, మంగళ వాయిద్యాల మధ్య పల్లకీలో కల్యాణ మండపం వద్దకు చేరుకుని సింహాసనంపై ఆసీనులవుతారు. అనంతరం అమ్మవారు పల్లకీలో కల్యాణ మండపం వద్దకు చేరుకోవడంతో కల్యాణ తంతు ప్రారంభం అవుతుంది. ఆలయ స్థానాచార్యులు రంగాచార్యులు సమక్షంలో ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యంలో కల్యాణ తంతును జరుగుతుంది.

రక్షాబంధనం: కల్యాణ కార్యక్రమంలో నియమ నిబంధనలను సక్రమంగా నిర్వహించమని వేదమంత్రాలతో సర్వతో రక్షించమని కోరుతూ అర్చక స్వాములు రక్షాబంధనం చేస్తారు.

గోదానం: పవిత్రమైన దర్భాలతో (కూర్చ) గోవుగా భావించి గోదాన మంత్రాలతో గోదానం నిర్వహిస్తారు.

శుభ ముహూర్తం: మాఘమాసంలో ఆరుద్ర నక్షత్రయుక్త వృశ్చిక లగ్న పుష్కరాంశమందు సోమవారంరాత్రి 12:29గంటలకు (తెల్లవారితే మంగళవారం) శ్రీ స్వామివారు, అమ్మవార్ల శిరస్సుపై జీలకర్ర, బెల్లం అర్చక స్వాములు చేత సమర్పిస్తారు.

కన్యాదానం: కొబ్బరి బొండం, గుమ్మడికాయ, గంధపుచెక్క, అరటిపండ్లు, శ్రీభూదేవిలను స్వామివారికి దానం చేస్తారు.

సువర్ణయజ్ఞోపవేత ధారణ: సువర్ణ యజ్ఞోపవేత ధారణ శ్రీ స్వామివారికి, శ్రీ భూదేవిలకు మంగళసూత్ర ధారణ నిర్వహిస్తారు.

ముత్యాల తలంబ్రాలు: పొలమూరి రాజుల సత్రం నిర్వాహకులచే సమర్పించబడిన మంచిముత్యాల తలంబ్రాలు ముందుగా అర్చక స్వాములు, స్థానాచార్యుల వారు, మొగల్తూరు రాజావారు, పొలమూరి రాజులు సమర్పిస్తారు.

బ్రహ్మముడి: అర్చక స్వాములచేస్వామి, అమ్మవార్లకు చమ్కీ దండలు, పూల దండలు సమర్పిస్తారు. అనంతరం ఆశీర్వచనాలు, మంగళ హారతి నిర్వహిస్తారు.



మూలవరులు

వార్షిక కల్యాణోత్సవ బంగారు ఆభరణాలు

కల్యాణోత్సవమూర్తులకు బంగారుఆభరణాలు ఇచ్చిన దాతలు అంతర్వేదికి చెందిన డాక్టర్ పోతురాజు సూర్యవెంకటసత్యనారాయణ, కుటుంబ సభ్యులు సమర్పించిన ఆభరణాలతో కల్యాణం జరుగుతుంది.



హంసవాహనంపై స్వామివారి గ్రామోత్సవం , స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా స్వామివారి గ్రామోత్సవాలు

అంతర్వేది, ఫిబ్రవరి 18: అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి లక్ష్మీసూర్యనారాయణరాజు వారిచే నిర్మించిన హంస వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం జరిపారు. తొలుత స్వామివారిని అర్చక స్వాములు అలంకరణ చేసిన అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. గ్రామ పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం 6.30 గంటలకు అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి వైభవంగా ధ్వజారోహణ నిర్వహించారు. గరుత్మంతుడు చిత్రపటాన్ని ధ్వజస్తంభంపై అర్చకులు ఎగురవేశారు. రాత్రి 8 గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు గన్నాబత్తుల వెంకటరాజారావు లక్ష్మీనరసింహస్వామి వారిచే నిర్మితమైన శేషవాహనంపై గ్రామోత్సవం జరిపారు. స్వామివారికి భక్తులు హారతులు పట్టి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రామగోపాల రాజాబహద్దూర్, ఆలయ సహాయకమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వలవల రాంబాబు, మందపాటి వెంకటేశ్వర్లు, వనమాలి మూలాస్వామి, ఉత్సవ సేవాకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల్లో నేడు...

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 5గంటలకు సుప్రభాతసేవ, 7గంటలకు అర్జిత అభిషేకం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, సాయంత్రం 4గంటలకు పంచముఖ ఆంజనేయస్వామి వాహనం, రాత్రి 8.30 గంటలకు కంచుగరుడ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవాలు నిర్వహించబడతాయని ఆలయ సహాయక మిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

పురాతన ఆలయాలకు నూతనత్వం కల్పించాలి



భక్తులనుద్దేశించి అనుగ్రహ బాషణం చేస్తున్న చినజీయర్ స్వామి

- చారిత్రక నేపథ్యం పాడవకూడదు
- ఆచార్య శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి

కోరుకొండ, ఫిబ్రవరి 18: సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లుగా ఉన్న భారతదేశంలో పురాతన ఆలయాలకు నూతనత్వం కల్పించాలని ఈ సందర్భంలో ఆలయాలకు చారిత్రక నేపథ్యం పాడవకూడదని పరమహంస పరివ్రాజక ఆచార్య శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి అన్నారు. కోరుకొండలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు వచ్చిన ఆయన కొద్దిసేపు అనుగ్రహ భాషణం చేశారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం ద్వారా కొన్నివేల సంవత్సరాల చరిత్రకు ప్రాణం పోసినట్టుయిందన్నారు. ఆనాడు శ్రీలంకకు రాముడు వేసిన సేతువు పదిహేడున్నర లక్షల సంవత్సరాలుగా నాసా ప్రకటించిందన్నారు. ఇది సహజంగా ఏర్పడింది కాదని మానవ నిర్మితమని తేల్చిచెప్పారని చినజీయర్ స్వామి గుర్తుచేశారు. ప్రపంచలో ఏ మూల అప్పటికి ఏ నాగరికత కళ్లు తెరవలేదన్నారు. అందువల్లే కొత్త ఆలయాలు నిర్మించడం కన్నా పాత ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, అన్నవరం దేవస్థానం జాయింట్ కమిషనర్ రామచంద్రమోహన్, అన్నవరం, కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాలు వేద పండితులు పాల్గొన్నారు.

రేపు ద్రాక్షారామ భీమేశ్వరుడి కల్యాణం



భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవారు

ఘనంగా ఏర్పాట్లు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 18: ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రం, పంచారామం ద్రాక్షారామలో ఉన్న మాణిక్యాంబసమేత భీమేశ్వరస్వామివారి దివ్యకల్యాణం 20న మంగళవారం నిర్వహించనున్నారు. స్వయంభువుడు శ్రీభీమేశ్వరస్వామి వారు, ద్వాదశశక్తిపీఠం మాణిక్యాంబ అమ్మవారికి, క్షేత్ర పాలకులు శ్రీలక్ష్మీసమేత నారాయణస్వామివారు, శ్రీచండిక సమేత సూరేశ్వరస్వామివార్లకు ఒకే వేదికపై మంగళవారంరాత్రి ఆరుద్ర నక్షత్ర తులాలగ్నమందు రాత్రి 10.25నిమిషాలకు ఏకకాలమందు కల్యాణ మహోత్సవం జరుగుతుంది.

స్వామివారికి రుద్రాభిషేకం, లక్ష రుద్రాక్షలతో పూజ

మంగళవారం ఉదయం 5.45కు కల్యాణమూర్తులను ఆహ్వానిస్తారు. స్వామి కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని ఉదయం 8.00 గంటలకు భీమేశ్వరునికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుంది. అనంతరం లక్ష రుద్రాక్షలతో పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 3.05 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, 5 గంటలకు నందివాహనంపై స్వామివారి నగరోత్సవం జరుగుతుంది. అనంతరం రాత్రి 10.25 నిమిషాలకు స్వామివార్ల కల్యాణం దేవస్థానం బ్రహ్మదేవులపల్లి పణిరామకృష్ణచే జరుగుతుంది. తిరుమల తిరుపతి దేవస్థానం వారు స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

కల్యాణ కార్యక్రమాలు

21న గరుడవాహనంపైస్వామివారి నగరోత్సవం జరుగుతుంది. 22న ఉదయం 9గంటలకు నగరోత్సవం, సాయంత్రం 4.45 గంటలకు స్వామి వార్ల సదస్యం, పండిత సత్కారం రాత్రి 8.45కు సర్వవాహనములపై స్వామివారి నగరోత్సవం నిర్వహిస్తారు. 23న మధ్యాహ్నం 2.35 గంటలకు భీమేశ్వరుని రథోత్సవం, సాయంత్రం 6.00 గంటలకు వేగాయమ్మపేట ఆస్థాన మండపంలో స్వామివార్ల ఆస్థాన పూజ జరుగుతుంది. 24న ఉదయం 8.10గంటలకు స్వామి వసంతోత్సవం, నాకబలి, తదుపరి త్రిశూల, శ్రీ చక్ర స్నానం జరుపుతారు. 25 రాత్రి 7.05 గంటలకు సప్తగోదావరి నదిలో స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తారు. 26న రాత్రి 7.05లకు స్వామివారి శ్రీపుష్పోత్సవం జరుగుతుంది.

శోభాయమానంగా కల్యాణవేదిక

భీమేశ్వరస్వామి కల్యాణమహోత్సవాలు పురస్కరించుకుని ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ అంతర ప్రాంగణంలో శోభాయమానంగా కల్యాణ వేదికను భారీగా తీర్చిదిద్దారు. స్వామి కల్యాణం వేలాదిమంది తిలకించేందుకు ప్రత్యేకంగా పందిర్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేశారు. కల్యాణ మహోత్సవం తిలకించేందుకు వచ్చిన భక్తులకుస్వామి తీర్థప్రసాదాలతోపాటు, స్వామివారి కల్యాణ ముత్యాల తలంబ్రాలు అందజేస్తామని ఆలయ ఈవో పి.టి.వి. సత్యనారాయణ తెలిపారు.

దేవస్థానం అన్నదాన మండపం ప్రారంభం

ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దేవస్థానం అన్నదాన మండపం ఆదివారం ఉదయం 10.42 గంటలకు ప్రారంభించారు. రూ.1.5కోట్లతో నిర్మించిన అన్నదాన మండపాన్ని వ్యాపారవేత్త సత్తిసుబ్బారెడ్డి, సీతారత్నం దంపతులు, కుటుంబీకులు పూజాధికాలు నిర్వహించి భవనం ప్రారంభించారు. అన్నదాన మండపం సత్తిసుబ్బారెడ్డి దంపతులు నిర్మించారు. తొలిరోజు 5 వేలమందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఏపీఐడీసీ డైరెక్టరు వాసంశెట్టి శ్యామ్, వైస్ ఎంపీపీలు శాకా బాబి, నరాల రాజ్యలక్ష్మీ, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఈవో పి.టి.వి. సత్యనారాయణ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



భీమేశ్వరస్వామి అన్నదాన మండపం ప్రారంభిస్తున్న సత్తిసుబ్బారెడ్డి, సీతారత్నం దంపతులు

బైక్‌ను ఢీకొట్టి.. కాల్వలోకి దూసుకెళ్లిన కారు

- మోటార్ సైకిలిస్ట్‌కు తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు
- కారులో ప్రయాణిస్తున్న ఏడుగురిలో ఒకరికి గాయాలు
- ఏడుగురు ప్రాణాలు కాపాడిన ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్

పి.గన్నవరం, ఫిబ్రవరి 18: అదుపుతప్పిన కారు బైక్‌ను ఢీకొట్టి ఆపై ప్రధాన పంటకాల్వలోకి దూసుకుపోయిన సంఘటన పి.గన్నవరం మండలం బెల్లంపూడిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.... రాజమహేంద్రవరంలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఓ కుటుంబం తిరిగి తమ స్వగ్రామం శివకోడు కారులో వస్తూ.....మార్గంమధ్యలో బెల్లంపూడి గ్రామం వచ్చే సరికి కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ప్రధాన పంటకాల్వలోకి దూసుకుపోయింది. దీంతో మోటార్‌సైకిలిస్ట్ తాడాలవారిపాలెంనకు చెందిన యర్రంశెట్టి స్వామినాయుడు కాలుకు తీవ్రగాయం కాగా అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. కారులో ప్రయాణిస్తున్న కసుకుర్తి భాస్కరసుధీర్‌కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. అలాగే ఆయన భార్య కె.సింధూ, పిల్లలు భాను, జయన్సు, తల్లి కె.పార్వతి, అత్తమామలు బిక్కిన సూర్యకాంతం, సుబ్బారాయుడులు సురక్షితంగా బయటపడ్డారు. కాగా అటుగా వెళుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు సంఘటనాస్థలిని పరిశీలించి స్వామినాయుడును హుటాహుటిన ఆసుపత్రికి తరలించే ఏర్పాటుచేశారు. అయితే స్వామినాయుడు గతంలో టైలరింగ్ పనిచేసుకుని జీవనం సాగించేవాడు ఆరోగ్యం సహకరించకపోవడంతో గత కొన్నాళ్లుగా బెల్లంపూడి సెంటర్‌లో చిరువ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈప్రమాదంతో ఆకుటుంబం రోడ్డున పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బెల్లంపూడి పంట కాల్వలోకి దూసుకుపోయిన కారు నుంచి ప్రయాణికులను బయటకు తీస్తున్న ఏఆర్ కానిస్టేబుల్



ప్రమాదం నుంచి బయటపడ్డ శివకోడు గ్రామానికి చెందిన ప్రయాణికులు

ఏడుగురు ప్రాణాలు కాపాడిన ఏఆర్ కానిస్టేబుల్..

తూర్పుగోదావరిజిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నెల్లి శ్రీనివాస్ ఉడిమూడి శివారు చింతావారిపేటలో ఒక వివాహవేడుకలో పాల్గొని తన కారులో మండల కేంద్రం పి.గన్నవరం వెళ్లారు. తిరిగి రాజమహేంద్రవరం బయలుదేరగా మార్గంమధ్యలో బెల్లంపూడిలో వచ్చే సరికి కళ్లెదుటే జరిగిన సంఘటనను చూశారు. వెంటనే స్పందించిన శ్రీనివాస్ చాకచక్యంగా వ్యవహరించి పంటకాల్వలోకి దూకి స్థానికుల సాయంతో ఏడుగురినీ ఒడ్డుకు చేర్చారు. శ్రీనివాస్‌ను స్థానిక ఎమ్మెల్యే చిట్టిబాబుతో పాటు ప్రయాణికులు బంధువులు, స్థానికులు అభినందనలు తెలిపారు. ఆ కుటుంబం ప్రాణాలు కాపాడి నిజమైన పోలీస్‌గా నిలిచారని ప్రసంశలు కురిపించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ శ్రీనివాస్ మాట్లాడుతూ పంటకాల్వలోకి దూసుకుపోయిన కారుకు కాల్వలో పేరుకుపోయిన తూడు అడ్డేసింది. దీంతో కాల్వలోని కూతవేటు దూరంలో నీటిలో తేలియాడుతున్న కారు వద్దకు వెళ్లే సరికి నీరు వేగంగా ప్రవహిస్తోంది. వెంటనే డోరులు లాగి వలంటీర్ లక్ష్మణ్, స్థానికులు సాయంతో ఏడుగురును ఒడ్డుకు చేర్చాగలిగాను. తూడు లేకపోతే కారు కాల్వమధ్యలోకి వెళ్లి పెనుప్రమాదం సంభవించేది.

కాల్వ చెంతనే రక్షణగా రైలింగ్‌లు ఏర్పాటు చేయాలి

రాజవరం-పొదలాడ రహదారిలో గంటి నుంచి పి.గన్నవరం వరకు ప్రధాన పంట కాల్వ వైపు రక్షణగా ఇనుప రైలింగ్‌లను ఏర్పాటు చేయాలి. అప్పుడే ఇటువంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదని స్థానికులు కోరుతున్నారు.



అట్లపాడు వద్ద స్కూటీ పై నుంచి పడి మృతి చెందిన లెక్చరర్

స్కూటీ నుంచి జారిపడి లెక్చరర్ మృతి

నిడదవోలు, ఫిబ్రవరి 18: స్కూటీ నుంచి జారిపడి ఓ లెక్చరర్ మృతిచెందారు. నిడదవోలులోని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న మెరకనల్లి ప్రసన్నకుమార్ (55) ఆదివారం నిడదవోలు నుంచి వేలివెన్ను వెళుతూ అట్లపాడువద్ద స్కూటీ అదుపుతప్పి జారిపడి రోడ్డుపై పడ్డంతో ముఖానికి తీవ్రగాయా లై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ప్రసన్న కుమార్ కొద్దిరో జులుగా వేలివెన్ను శశి కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నా రు. ఆయనకు భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్ఐ రమేష్ తెలిపారు.

దగా పడ్డ దళితులు : మహాసేన రాజేష్



నిడదవోలులో దళితుడా రా కదలిరా సభలో ప్రసంగిస్తున్న మహాసేన రాజేష్

నిడదవోలు, ఫిబ్రవరి 18: ఎంతో పౌరుషం ఉన్న దళితులు వైసీపీ ప్రభుత్వంలో దగా పడ్డారని, జగన్‌రెడ్డి దళితులను నమ్మించి మోసం చేశాడని, మోసపోయిన దళితులు 2024 ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మహాసేన రాజేష్ అన్నారు. నిడదవోలు లోని బీఆర్ అంబేడ్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలులో ఆదివారం దగాపడిన దళితుడా రా.. కదలి రా.. కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మనవాళ్లెవరో పగవాళ్లెవరో తెలుసుకుందామని దళితులకు గౌరవం ఇస్తున్న చంద్రబాబు, లోకేశ్‌లకు అండగా ఉండి 2024 ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. వైసీపీ పాలనలో దళితులు హత్యకు గురవుతున్నారని, టీడీపీ పాలనలో దళితులు రాజకీయంగా ఎదిగేందుకు ఎంతో భవిష్యత్తు ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలకు దళితులు ఆరాటపడక్కరలేదని, అందరికీ ఇస్తున్న పథకాలే ఇస్తున్నారని, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేకంగా ఇచ్చేవి ఏమీ లేవన్నారు. అన్ని రంగాల్లో ఉన్న దళితులు అభివృద్ధి చెందాలని, అది టీడీపీ ప్రభుత్వం హయాంలోనే సాధ్యమవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవడమే మనందరి బాధ్యత అని రాజేష్ అన్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుతో కలసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

- మరొకరి పరిస్థితి విషమం



రోడ్డు ప్రమాదానికి గురైన యువకులు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 18: అయినవిల్లి మండలం మాగం నుంచి అమలాపురం పల్సర్ మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ఉన్న కొబ్బరి చెట్టును ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందగా ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సిరిపల్లి-మునిపల్లిరోడ్డులో ముమ్మిడివరం మండలం అనాతవరం పంచాయతీ పరిధిలో గుబ్బలవారిపాలెం వద్ద ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అమలాపురంనకు చెందిన అడబాల సాయి హర్ష(23) అక్కడిక్కడే మృతి చెందాడు. పెదపట్నంలంకకు చెందిన కొమ్ముల అనిల్(21) అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అమలాపురానికి చెందిన యండమూరి లోకేష్(23) అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. హర్ష మృతదేహన్ని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్ బాబు కేసు నమోదు చేసి దరాప్తు చేపట్టారు. ఈముగ్గురు మిత్రుల్లో అడబాల హర్ష ఇటీవల మోటార్‌సైకిల్ కొనుగోలు చేశాడు. వీరిలో బీటెక్ వరకు చదువుకున్న హర్ష అయినవిల్లి మండలం మాగంలో అమ్మమ్మ ఇంటివద్ద ఉంటున్నాడు. వారి తల్లిదండ్రులకు ఇద్దరు మగసంతానం. లోకేష్ డిగ్రీ వరకు చదువుకుని ప్రస్తుతం ఉద్యోగం చేసుకుంటున్నాడు. కొమ్ముల అనిల్ ఇటీవలే గల్ఫ్ నుంచి తిరిగివచ్చాడు.



తాళ్లపోడులో కాలిపోతున్న బస్సు

పార్కింగ్ చేసిన చోటే.. కాలేజీ బస్సు దగ్ధం

కె.గంగవరం, ఫిబ్రవరి 18: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం తాళ్లపోడులో ఆదివారం ఉదయం పార్కింగ్ చేసిన బస్సులో మంటలు వ్యాపించి దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నా యి. తాళ్లరేవు మండలం సుంకరపాలెం పరిధిలోని రవి జూనియర్ కాలేజీ బస్సు తాళ్లపోడు పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులను కళాశాలకు తరలిస్తుంది. ఆదివారం కావడంతో తాళ్లపోడులోనే పార్కింగ్ చేశారు. ఆదివారం ఉదయం ఉన్నట్టుండి బస్సు నుంచి మంటలు వ్యాపించాయి. స్థానికులు మంటలు అదుపు చేశారు. అప్పటికే బస్సు చాలావరకూ కాలిపోయింది. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉమామహేశ్వరరావు ఫిర్యాదు చేశారు. పామర్రు ఎస్.ఐ. జానీబాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సందేశాత్మకంగా సాగిన నాటికలు

తాటిపర్తిలో ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 18: మన సంస్కృతి, సంప్రదాయాల విశిష్టత, కుటుంబ విలువలు ప్రాధాన్యతను చాటిచెబుతూ నాటికల ప్రదర్శనలు కొనసాగాయి. గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళావేదికపై మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు రెండో రోజు ప్రదర్శించిన నాటికలు సందేశాత్మకంగా సాగాయి.ప్రేమ విలువను తెలియచెబుతూ ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటిక అందరినీ ఆలోచింప చేసింది. ప్రేమ అనేది సృష్టిలో ఎంతో గొప్పదని, అది సమాజంలో అందరూ హర్షించేలా ఉండాలే తప్ప, అనాలోచిత నిర్ణయాలతో తప్పటడుగులు వేయకూడదని ఈ నాటిక ద్వారా చాటిచెప్పారు. గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను గోపి సత్యప్రకాష్(స్నిగ్ధ) రచించగా, ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు.

బిడ్డలపై అమ్మకు ఉండే అనురాగం, ప్రేమ చాటిచెప్పిన..

అమ్మ మనస్సు బిడ్డలపై ఆమెకు ఉండే ప్రేమ, అనురాగం చాటిచెబుతూ కౌసల్య సుప్రజ రామా నాటికను ప్రదర్శించారు. పురాణాలు, వేదాలు, సమాజాలు, ఓంకార నాదాలకు ఒక ధర్మం ఉన్నట్టే అమ్మ మనస్సుకు ఒక ధర్మం ఉంటుంది. అదే కనిపెంచిన ధర్మం, మనకు కనిపించని ధర్మం అంటూ అమ్మ విశిష్టతను చాటిచెప్పింది. రామాయణంలో రాముడు అడవులకు వెళ్లినప్పుడు తల్లి కౌసల్య ఎంత బాధపడుతుంది, అతని కూడా వెళ్లకపోయినా మనస్సు మాత్రం అతని ఉన్న విధంగానే నేడు బిడ్డలు వద్దని వదిలించుకుంటున్నా, సముద్రాలు దాటి విదేశాలకు వెళ్లిపోతున్నా అమ్మ మనస్సు మాత్రం వారిని అంటి పెట్టుకునే ఉంటుందని, ఇది అందరూ గమనించాలని సందేశాన్నిచ్చారు. కొలకలూరు సాయి ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను గోపి సత్యప్రకాష్ రచించగా, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు.



స్వీకారం నాటికలోని దృశ్యం

భార్యను వదిలివేస్తే కుటుంబమే వెలివేసింది

- కుటుంబ విలువల విశిష్టతను చాటిచెబుతూ స్వీకారం నాటిక

కుటుంబ విలువలను చాటిచెబుతూ అది మీరితే అందరికీ దూరమవ్వాల్సి ఉంటుందనే సందేశాన్నిఇస్తూ స్వీకారం నాటికను ప్రదర్శించారు. సంప్రదాయబద్ధంగా ఉన్న కుటుంబం నుంచి వచ్చిన మహిళను విదేశాల్లో ఉన్న కొడుకుకు ఇచ్చి వివాహం చేస్తాడు ఒక తండ్రి. అయితే అక్కడే ఉన్న వేరే మహిళతో డేటింగ్‌లో ఉండి తన భార్యకు విడాకులు ఇస్తాడు. దీంతో అతని తండ్రి కోడలును దత్తత తీసుకుంటారు. ఇది తెలిసి స్వదేశానికి వచ్చిన కొడుకు ప్రశ్నిస్తూ నీవు నీ భార్యకు విడాకులు ఇవ్వడం కాదు. నేనే మీకు విడాకులు ఇస్తున్నామని తల్లిదండ్రులు చెబుతారు. మా ఆస్తికి ఆమే వారసురాలని ప్రకటిస్తారు. అగ్నిసాక్షిగా పెళ్లాడిన భార్యను లేదా భర్తను వదిలివేసే వారికి తండ్రులు ఇచ్చే తీర్పు ఇదేనని నాటిక ద్వారా తెలియజెప్పారు. అమలాపురం రసవాహిని కళాకారులు ప్రదర్శించిన స్వీకారం నాటికను రావి నాగేశ్వరరావు రచించగా, మహ్మద్ షహెన్నా దర్శకత్వం వహించారు.



తాటిపర్తిలో జరుగుతున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీల్లో ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటిక

కాకినాడ

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గండేపల్లి, ఫిబ్రవరి 18: రాబోవు అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా గండేపల్లి ఎస్ఐ రామకృష్ణ ఆదివారం గండేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. జడ్.రాగంపేట గ్రామంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి గ్రామ పెద్దలు, సంబంధిత పార్టీ కార్యకర్తలకు సూచనలు,సలహాలు ఇచ్చారు. ఏ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని సదస్సు నిర్వహించారు.

వైభవంగా భావనారాయణస్వామి తిరునాళ్లు



పాలపొంగులు తయారు చేస్తున్న భక్తులు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 18: దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న శ్రీభావనారాయణస్వామి తిరునాళ్లు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. సర్పవరంలో అతి పురాతన శైవక్షేత్రం శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామిని దర్శించుకునేందుకు ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చారు. కోనేరులో పుణ్యస్నానాలాచరించి పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. సూర్యభగవానుడికి ప్రీతిపాత్రమైన పాలపొంగులను ఆలయ ప్రాంగణంలో ఆవు పిడకలతో ఏర్పాటు చేసిన పొయ్యిపై మహిళా భక్తులు తయారు చేశారు. పాలపొంగులతో కలపి మొలకెత్తిన పెసలు, రేగుపండ్లు, చెరుకు ముక్కలు, అరటిపండ్లను స్వామివారికి నేవైద్యంగా నివేదించారు. 30 వేల మంది దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు,ఈవో జొన్నాడ భీమశంకరరావు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 20 వేలమందికి అన్నదాన ప్రసాదాన్ని పంపిణీ చేశారు. సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

గండేపల్లి, ఫిబ్రవరి 18: మల్లేపల్లి గ్రామంలోని శెట్టిబలిజపేటలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీలో భాజా భజంత్రీలు, కోలాట నృత్యాలు, శక్తి వేషాలతో ఊరేగింపు నిర్వహించారు. 500 మందికి పైగా మహిళలు పూర్ణకలశాలు శిరస్సుపై పెట్టుకుని స్వామి రథం వెంట వెళ్లారు. పురోహితులు వైష్ణవి దాస్ నాగేశ్వరరావు మంత్రోచ్చరణల నడుమ ఆలయకమిటీ ఆధ్వర్యానఉత్సవాలు జరిగాయి.

నేటి నుంచి సీతారాముల ప్రాణప్రతిష్ఠా ఉత్సవాలు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 18: గొల్లప్రోలు మెయిన్‌రోడ్డులో సీతారాముల నూతన విగ్రహ ప్రాణప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 19వ తేది ఉదయం విఘ్నేశ్వర పూజ, మండపారాధనలు, విగ్రహ ప్రతిష్ఠ, కళాన్యాసములు జరుగుతాయి. ఈ కార్యక్రమాలు మాధురి విద్యాసంస్థల అధినేత కడారి తమ్మయ్యనాయుడు, సీతాదేవి దంపతులు నిర్వహిస్తారు. 20న భీష్మ ఏకాదశి సందర్భంగా కలశ స్థాపన, జ్యోతిప్రజ్వలన, 75వ ఏకాహంలో భాగంగా 24గంటల పాటు నిరంతర భజన కార్యక్రమాలు జరుగుతాయి. 21వ తేది ఉదయం 10గంటలకు సీతారాముల దివ్య కల్యాణ మహోత్సవం, అనంతరం భారీ అన్నసమారాధన జరుగుతుంది. దేవుడి గుడి రామకోవెలను ఆధునీకరించి, నూతన విగ్రహాలను కడారి తమ్మయ్యనాయుడు దంపతులు సమకూర్చారని దేవుడిగుడి రామకోవెల భక్తమండలి ప్రతినిధులు తెలిపారు.

నేటి నుంచి వేంకటేశ్వరుని సప్తమ వార్షికోత్సవాలు

తొండంగి, ఫిబ్రవరి 19: ఏవినగరంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని సప్తమ వార్షికోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నట్లు ఆలయ ధర్మకర్త యనమల నాగేశ్వర్రావు తెలిపారు. తెల్లవారుజామున షిర్డీ సాయిబాబా ఆలయంలో కాకడ హారతి, ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహిస్తారన్నారు. అనంతరం సాయి సత్యవ్రతాలు, మధ్యాహ్న హారతి ప్రత్యేకపూజలు, సాయంత్రం ఊరేగింపు ఉంటాయన్నారు. మంగళవారం భీష్మ ఏకాదశి సందర్భంగా కల్యాణ వేంకటేశ్వరుడికి 108 కలశాలతో అభిషేకం, లక్ష తులసి పూజ, మహానారాయణ యాగం, పూర్ణాహుతి, అన్న ప్రసాద వితరణ ఉంటాయన్నారు. సాయంత్రం ఊరేగింపు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బుధవారం స్వామివారి చక్రస్నానం వైభంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రేపటి నుంచి కేశవ, పట్టాభిరామ కల్యాణోత్సవాలు

పెద్దాపురం, ఫిబ్రవరి 18: మండలంలోని కట్టమూరు గ్రామంలో శ్రీదేవి, భూదేవీ సమేత కేశవస్వామి, సీతాదేవీ సమేత పట్టాభిరామవార్లకు ఈనెల 20 నుంచి 25వ వరకూ కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం ఈవో కట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. కల్యాణోత్సవాల్లో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఉంటాయన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

నేడు 'స్పందన, డయల్ యువర్ కమిషనర్'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 18: ప్రజాసమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. నగర ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం 0884-2357800 నెంబరుకు కాల్ చేసి తెలియజేయవచ్చన్నారు. 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా సమస్యలు తెలియజేయవచ్చని సూచించారు.

'కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 18: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఏపీ కిసాన్ సెల్ కోఆర్డినేటర్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకట్రావు చెప్పారు. ఏలేశ్వరం మండలంలోని మర్రివీడు, పరిమితడక, జెడ్డంగి అన్నవరం, తూర్పు లక్ష్మీపురం, రమణయ్యపేట, టి.రాయవరం, మార్కెండేయపురం గ్రామాల్లో ఆదివారం ఇంటింటా కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానిగా రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు దొంతంశెట్టి చంద్రశేఖర్, పి.పెదబాబు, పలివెల నాగేశ్వరరావు, దువ్వా రాజు, పి.పెదబాబు తదితరులు ఉన్నారు.

'ఎన్నికల్లో మంచి నిర్ణయం తీసుకోండి'

జగ్గంపేట, ఫిబ్రవరి 18: రాష్ట్ర భవిష్యత్తు కోసం యువత రాబోయే ఎన్నికల్లో మంచి నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతు శివగణేష్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడంతోపాటు అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణరాజు, సత్యనారాయణ, రత్నాజీరావు, చంద్రమౌళి, వెంకటరత్నం, బాపిరాజు, విష్ణుచక్రరావు, శ్రీను పాల్గొన్నారు.

'జూపూడి వ్యాఖ్యలు సిగ్గుచేటు'

అన్నవరం, ఫిబ్రవరి 18: అంబేడ్కర్ విదేశీ విద్య పేరుపై రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జూపూడి ప్రభాకరరావు అంబేడ్కర్ పేరును తీసివేసి జగన్ పేరు పెట్టిన తమకు ఆనందమేనని అనడం సిగ్గుచేటని అన్నవరంలో దళిత నాయకులు నిరసన వ్యక్తం చేసి ఆయన దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. దళితజాతిని అడ్డుపెట్టుకుని అనేక పదవులు పొంది కళ్లు మూసుకుపోయి వ్యాఖ్యలు చేయడం దళితజాతికి ద్రోహం కాదా అని సరమర్ల మదుబాబు, రాయి శ్రీనివాస్, తంతటి కిరణ్‌కుమార్ ప్రశ్నించారు.

నడకుదురులో 'జనం కోసం పవన్'

కరప, ఫిబ్రవరి 18: జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ ఆధ్వర్యంలో ఆదివారం కరప మండలం నడకుదురులో జనం కోసం పవన్- పవన్ కోసం మనం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సమస్యపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రాబోయేది టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వమని, అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నానాజీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీనాయకులు సింగంపల్లి నాగేశ్వరరావు, బిరుద భాస్కర్ తమ్మయ్య, టీడీపీ నాయకులు పోతుల గోవింద్, వెంకటరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాహితి సంస్థ ఉపాధ్యక్షుడిగా గౌరీనాయుడు

పిఠాపురం, ఫిబ్రవరి 18: విశాఖపట్టణంలోని రాచకొండ నరసింహ శర్మ సాహితి సంస్థ ఉపాధ్యక్షుడిగా పిఠాపురానికి చెందిన యువ సాహితివేత్త, రచయిత డాక్టర్ కిలారీ గౌరీనాయుడు నియమితులయ్యారు. విశాఖలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాచకొండ నరసింహశర్మ ఈ ఉత్తర్వులను గౌరీనాయుడికి అందజేశారు. సాహిత్య, సంగీత, సాంస్కృతిక, కళారంగాల్లో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా తనకు సంస్థలో ఈ గౌరవం లభించిందని గౌరీనాయుడు తెలిపారు. ఆయన్ని డాక్టర్ సోమసుందర్ లిటరరీ ట్రస్టు ప్రతినిధులు అభినందించారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: ఈగల్, ఊరు పేరు భైరవకోన, మేడమ్‌వెబ్, గుంటూరుకారం, ట్రూలవర్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: ఈగల్, యాత్ర 2, ఊరు పేరు భైరవకోన, గుంటూరుకారం

తిరుమల	:	సూర్యసన్ఆఫ్‌కృష్ణన్, ఓయ్
లక్ష్మి	:	ఈగల్
సీ అండ్‌సీ1	:	ఈగల్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	అంబాజీ మ్యారేజ్‌బ్యాండు
పద్మప్రియ	:	ఊరు పేరు భైరవకోన
సత్యగౌరి	:	ఊరు పేరు భైరవకోన
సూర్య 1	:	ఈగల్
సూర్య 2	:	ఊరు పేరు భైరవకోన

పంటలను పరిరక్షించాలి

గండేపల్లి, ఫిబ్రవరి 18: పంటలు ఎండిపోకుండా పరిరక్షించాలని బొర్రంపాలెం రైతులు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూకు విన్నవించారు. బొర్రంపాలెంలో ఒక కార్యక్రమానికి హాజరైన జ్యోతుల నెహ్రూను రైతులు కలిసి తమ సమస్య తెలిపడంతో ఆయన కలెక్టర్ కృతికాశుక్లాకు ఫోన్ చేసి పుష్కర నీరు ఒక్కసారి వదిలి రైతులను కాపాడాలని వివరించారు. దీంతో కలెక్టర్ స్పందించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



సామర్లకోట: టీడీపీలో చేరినవారితో చినరాజప్ప



శంఖవరం: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సత్యప్రభ

సామర్లకోట, ఫిబ్రవరి 18: సామర్లకోట మండలం రావువారి చంద్రంపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు పంచాయతీ వార్డు సభ్యులతో సుమారు 100 మంది అనుచరులు ఆదివారం రాత్రి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. టీడీపీ నాయకులు తోటకూర శ్రీనివాస్, ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజప్ప హాజరయ్యారు. పంచాయతీ సభ్యులు దేశిరెడ్డి విఘ్నేశ్, తల్లిబోయిన నాగబూషణం, కురు పూడి సూరిబాబు, లింగం కుమార్ తదితర 100 మంది అనుచరులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి అభినందించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలకు, పెరిగిన ధరలకు ప్రజలు విసిగి వేశారి ఉన్నారన్నారు. నకిలీ మద్యంతో కూలీనాలీ చేసుకుని జీవించే ప్రజల ఆరోగ్యంతో వైసీపీ ప్రభుత్వం చెలగాటమాడుతుందని రాజప్ప ఆరోపించారు. కార్యక్రమంలో తలాటం అత్యుతరామయ్య ఆకునూరి సత్తిబాబు, చీకట్ల వెంకటేష్, సర్వేశ్వరరావు, పెంకే వెంకటేష్, ముమ్మిడి సూరిబాబు, తోట నాగబూషణం, గున్నాబత్తుల చెల్లారావు, దమ్మాల బాబీ, దేగల మురళీకృష్ణ, దమ్మాల వెంకట్, అడ్డాల వెంకన్నబాబు పాల్గొన్నారు.

సూరంపాలెంలో...

గండేపల్లి: మండలంలో సూరంపాలెం గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ, ఎమ్మెల్యే చంటిబాబు తోడల్లుడు కుంచే రాజా ఆదివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో సుమారు 500 మంది అనుచరులతో టీడీపీలో చేరారు. వారికి నెహ్రూ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ అరాచకపాలన చూడలేక పార్టీని వీడి తండోప తండాలుగా టీడీపీలోకి చేరుతున్నారన్నారు. యర్రంపాలెంలో మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి వెంకటలక్ష్మి బాబ్జి ఆధ్వర్యంలో 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌వీఎస్‌అప్పలరాజు, కోర్పు లచ్చయ్య దొర, మండలాధ్యక్షులు పోతుల మోహన్‌రావు, కందుల చిట్టిబాబు, జాస్తి వసంత్, కోర్పు సాయితేజ్,పాలకుర్తి ఆదినారాయణ, కొత్త కొండబాబు, బాబ్జి, కుంచే రామకృష్ణ, పోసిన బాబురావు, దాపర్తి సీతారామయ్య, బాలు, సుంకవిల్లి రాజు, అడబాల భాస్కరరావు, సుంకవిల్లి సత్యనారాయణ, చాగంటి సత్యనారాయణ, ముత్యాల రవి, ఉండవిల్లి వీర్రాజు ఉన్నారు.

ఇర్రిపాకలో...

జగ్గంపేట: ఇర్రిపాక శివాలయం వద్ద గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రా మానికి చెందిన వైసీపీకి చెందినవారు నుంచి టీడీపీరాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలోకి చేరారు. తిరుమలయపాలెం సర్పంచ్ పురంశెట్టి శివాజీ, ఉండమట్ల దొరబాబు, సుంకవల్లి రాజు, కోడూరి సత్యనారాయణ,పిల్ల వీరబాబు పాల్గొన్నారు.

కొత్తూరులో...

శంఖవరం: కొత్తూరు గ్రామానికి చెందిన 50 వైసీపీ కుటుంబాలకు చెందిన కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు కర్రి శివ గణేష్, కొండపల్లి శివరామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి సత్యప్రభ సమక్షంలో ఏ.సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కర్రి వెంకటరమణ, మాజీ ఉప సర్పంచ్ ముప్పిన రామణ, రాయి రామకృష్ణతో పాటు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో బద్ది రామారావు, వెన్నాశివ, బద్దిరమణ, పర్వత సురేష్, కిర్తి సుభాష్, ఎస్.మధుబాబు తదితరులు ఉన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

బోనాలతో తరలివచ్చిన మహిళలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 18: గొల్లప్రోలు మండలం చెందుర్తి జంక్షన్ 216వ జాతీయ రహదారి సమీపంలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. చేబ్రోలు గ్రామంలోని నూకాలమ్మ ఆలయం నుంచి కనకదుర్గమ్మ ఆలయం వరకూ మహిళలు బోనాలతో ప్రదర్శనగా తరలివచ్చారు. బోనాలను అమ్మవారికి సమర్పించి అక్కడ కుంకుమపూజలు, హోమాలు నిర్వహించారు. తాటికొండ పవన్ దంపతులు చేతులు మీదుగా విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. కనకదుర్గమ్మను కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, గొల్లప్రోలు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు దర్శించుకున్నారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది.

దుర్గమ్మకు బోనాల సమర్పణ



తొండంగిలో బోనాలతో వెళ్తున్న మహిళలు


తొండంగి, ఫిబ్రవరి 18: తొండంగి రామాలయం సెంటర్లో దుర్గమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు బోనాలు సమర్పించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు బాజాభజంత్రీల నడుమ సంప్రదాయ వస్త్రధారణతో పవిత్ర కలశాలను తలపై ధరించి అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. పవిత్ర జాలాలతో అభిషేకించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిపారు. సోమవారం అమ్మవారికి కుంకుమ పూజలు, మంగళవారం ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది.

శివలింగం వద్ద సర్పం



జగ్గంపేట, ఫిబ్రవరి 18: మండలంలోని ఇర్రిపాక గ్రామంలో జ్యోతిర్లింగాల ప్రాగణంలోకి ఆదివారం ఓ సర్పం వచ్చి శివలింగంపై పడుకుంది. ఈ వింతను చూడడానికి జనాలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇర్రిపాకలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కుటుంబం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కోటి పార్థివ లింగ రుద్రాభిషేకం మట్టి శివలింగాలు తయారీలో పాల్గొని కుంభాభిషేకం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇలా ఉండగా ఓ పాము శివలింగం వద్దకు చేరుకోవడంతో భక్తులు ఆశ్చర్యపోతున్నారు. అయితే అమ్మ భగవాన్ శిష్యురాలు సౌజన్య దాసాజీ కుంభాభిషేకం ఏర్పాట్లను పరిశీలించారు. శివలింగాలను దర్శనం చేసుకుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతుల లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయ ఈవోగా నీలకంఠం



సామర్లకోట, ఫిబ్రవరి 18: సామర్లకోట కుమార రామ భీ మేశ్వరాలయ ఈవో బళ్ల నీలకంఠం(శివ)ను నియమిస్తూ ఆదివారం దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. నీలకంఠం ఇప్పటి వరకూ తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ దేవస్థానం ఈవోగా పనిచేసి సామర్లకోటకు బదలీ అయ్యారు. కాగా సామర్లకోటకు ఇప్పటివరకూ ఈవోగా పనిచేసిన డి.నాగమల్లేశ్వరరావు కోనసీమ అంబేడ్కర్ జిల్లా దేవదాయాధికారిగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. నూతన ఈవోగా నీలకంఠం సోమవారం సామర్లకోట చేరుకుని బాధ్యతలు స్వీకరించనున్నారు.

పంట కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 18: కాకినాడ రూరల్ తిమ్మాపురం శెట్టిబలజిపేట సమీపంలో గల పంట కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని తిమ్మాపురం పోలీసులు గుర్తించారు. పంట కాలువలో మృతదేహం ఉన్నట్టు సమాచారం రావడంతో తిమ్మాపురం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎంవీ రవీంద్రబాబు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఆచూకీ కోసం గాలించగా ఏ ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా నిర్ధారించి మృతదేహాన్ని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 32 ఏళ్లలోపు ఉంటుందని తిమ్మాపురం ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలకు 9440796556లో సంప్రదించాలని కోరారు.



పంట కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రవీంద్రబాబు, సర్పంచ్ సత్యనారాయణ

సైకో ప్రభుత్వాన్ని గద్దె దింపడం ఖాయం

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ



ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న వర్మ

కొమరగిరి (కొత్తపల్లి), ఫిబ్రవరి 18: రాష్ట్రంలో సైకో ప్రభుత్వాన్ని గద్దె దింపడం ఖాయని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. కొమరగిరి గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమంలో భాగంగా టీడీపీ సూపర్ సిక్స్ మానిఫెస్టో కరపత్రాలను ఆయన ప్రజలకు పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో తనకు ఒక్కొకరు ఒక్క ఓటిచ్చి నెగ్గించాలని, తద్వారా ఐదేళ్లపాటు సేవలందిస్తానని కోరారు. రాజధాని ఫైల్స్ సినిమాలో వైసీపీ ప్రభుత్వం రైతులు, వివిధ వర్గాల ప్రజలకు ఎలా ఇబ్బందులకు గురిచేసిందో కళ్లకు కట్టినట్టు చూపడం జరిగిందన్నారు. సామాజిక బాధ్యతతో నిర్మించిన సినిమాను అడ్డుకునే దీనస్థితికి జగన్ ప్రభుత్వం దిగజారిందని వర్మ విమర్శించారు. రాష్ట్ర రాజధానిని ఎలా సర్వనాశనం చేశారో సినిమాలో స్పష్టంగా చూపారని, ప్రతీ ఒక్కరూ రాజధాని ఫైల్స్ చూడాలన్నారు. రాజధానిలేని రాష్ట్రంగా చేసిన ఘనత జగన్‌రెడ్డిదని, నిన్నటి వరకు మూడు రాజధానులని, ఇపుడేమో హైదారాబాద్ ఉమ్మడి రాజధాని అనడం సైకో జగన్‌కే చెల్లిందన్నారు. రాష్ట్రంలో టీడీపీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక సైకో చేష్టలు చేస్తున్నారని ఆరోపించారు. మరో 50రోజుల్లో జగన్ ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కొమరగిరి మాజీ సర్పంచ్ కరారి రాజబాబు, మాజీ జడ్పీటీసీ బత్తుల చైతన్యరాజేష్‌కుమార్, మాజీ సహకారసంఘ అధ్యక్షులు రాయుడు శ్రీరాములు, సుబ్రహణ్యం, రామకృష్ణ, కన్నబ్బాయి, త్రిమూర్తులు, ఆనాల బాల మురళీకృష్ణ, ప్రసాద్, చక్రరెడ్డి, గాది రాజబాబు, రాయవరపు తిరుమలరావు,జానీ భాషా ఉన్నారు.

వరుపుల రాజా ఆశయ సాధనకు కృషి

ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి సత్యప్రభ



భద్రవరంలో కరపత్రాలు అందజేస్తున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 18: దివంగత టీడీపీ నేత వరుపుల రాజా ఆశయ సాధన కోసం కృషి చేస్తానని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ చెప్పారు. ఏలేశ్వరం మండలం భద్రవరంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా సత్యప్రభ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు తన భర్త రాజాపై ఎంతో ఆదరాభిమానాలు చూపారని, అదే అభిమానం తనపై కూడా చూపిస్తున్నారని మీ ఇంటి ఆడబిడ్డగా రాబోయే ఎన్నికల్లో దీవించాలని కోరారు. కార్యక్రమంలో జిగటాపు సూరిబాబు, కొప్పుల బాబ్జి, రాసంశెట్టి సత్తిబాబు,కొమ్మల కన్నబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జ్యోతుల పెదబాబు, సూది బూరయ్య, మూది నారాయణ స్వామి, చిక్కాల లక్ష్మణరావు, షైదాన కనకారావు, నూకతాటి ఈశ్వరుడు, పలివెల శ్రీనివాస్, కర్రి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు భారంగా మారిన వైసీపీ పాలన

తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య



తునిలో ప్రచారం నిర్వహిస్తున్న యనమల దివ్య

తుని రూరల్, ఫిబ్రవరి 18: వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలన ప్రజలకు భారంగా మారిందని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. తుని రైల్వే క్వార్టర్స్‌తో పాటుగా తుని గ్రామీణ ప్రాంతమైన దొండవాక అనుబంధ గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడుతో కలిసి పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని టీడీపీ,జనసేన మేనిఫెస్టో హామీలను వివరించారు. రానున్నది టీడీపీ,జనసేన ప్రభుత్వమమేనని, అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని హామీఇచ్చారు. తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ, గంట్ల చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సత్యనారాయణ

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 18: స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఆదివారం అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్న ప్రసాదరావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ అడ్డాల సత్యనారాయణ సుమారు 130 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవిశంకర్ పట్నాయక్, రాఘవరావు తదితరులున్నారు.

లారీని ఢీకొన్న బైక్

వ్యక్తికి తీవ్ర గాయాలు

సామర్లకోట, ఫిబ్రవరి 18: సామర్లకోట-జీ.రాగంపేట రోడ్డులో ఐఎంఎల్ డిపో సమీపాన రోడ్డుకు ఒక పక్కన ఆగిఉన్న లారీ వెనక భాగాన్ని మద్యం మత్తులో మోటార్‌సైకిల్ అతివేగంగా ఢీకొనడంతో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి పెదపూడి మండలం రామేశ్వరం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. రోడ్డుపై తీవ్రగాయాలతో పడి ఉన్న అతనిని ముందుగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం నిర్వహించి ఉన్నత చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీలో చేరికలు

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 18: బీజేపీ జిల్లా మీడియా ప్రతినిధి తుమ్మలపల్లి నాని ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు పైడ భవానీప్రసాద్ సమక్షంలో కార్పెంటర్స్ నాయకుడు తోలెం సతీష్ చొరవతో 20మంది బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. విశ్వకర్మయోజనపై వివరించారు. బీజేపీ నాయకులు ఘంటసాల గోవిందరాజులు, చోడిసెట్టి రమేష్‌బాబు, పైడా రవీంద్ర, బోలిసెట్టి రామకృష్ణ, తుమ్మల పద్మజ, శ్రీనివాసరాజు, విజయ రామయ్య, గూటూరు పద్మ, కాళ్ల దనరాజు, మనిబాల, అప్పాజీ, దుర్గ, స్వామి ఉన్నారు.

'లోవ'లో భక్తుల కోలాహలం



తలుపులమ్మ అమ్మవారు, దర్శించుకుంటున్న భక్తులు

తుని రూరల్, ఫిబ్రవరి 18: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం ఆదివారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు దేవస్థానం ఏర్పాటు చేసిన వంటషెడ్డు, వసతి గదుల్లో వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం అమ్మవారిని 10వేలు మందికి పైగా దర్శించుకోగా వివిధ విభాగాల ద్వారా రూ.2,13,761లు ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

వైభవంగా త్యాగరాజ ఆరాధన



త్యాగరాజ పంచరత్న కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

పిఠాపురం, ఫిబ్రవరి 18: పిఠాపురంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో త్యాగరాజ ఆరాధన కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. విశాఖపట్టణం ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి నుంచి ఆకొండి వెంకట్రావు శిష్యబృందం, కళాకారులు త్యాగరాజ సంకీర్తనలు, పంచరత్న కీర్తనలు ఆలపించారు. మృదంగంపై కామేష్, ఆచార్యులు వాద్యసహకారం అందించారు. సద్గురు త్యాగరాజ సంగీత సమాఖ్య ఆలయ అర్చకుడు పి.విజయజనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో నగర సంకీర్తన జరిగింది. త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తూ పురవీధుల్లో ప్రదర్శన సాగించారు. కార్యక్రమంలో గట్టి శ్రీకృష్ణదేవరాయ, డాక్టర్ జోగా వీరబాలాజీ, ఆలయ ఈవో నున్న శ్రీరాములు, వేదపండితులు తదితరులున్నారు.

కుంతీమాధవుని కల్యాణోత్సవాలు

పిఠాపురం, ఫిబ్రవరి 18: పట్టణంలోని కుంతీమాధవ స్వామి ఆలయంలో దివ్య కల్యాణ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం విష్వక్సేనుల వారి గ్రామోత్సవం జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ధ్వజారోహణము నిర్వహించారు. ఆలయ ఈవో నున్న శ్రీరాములు, కుంతీమాధవ భక్త బృందం సభ్యులు ఉన్నారు.

రత్నగిరిపై సూర్యనమస్కారాలు

అన్నవరం, ఫిబ్రవరి 18: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం సూర్యనమస్కారాలు నిర్వహించారు. కళామందిరంలో ఆరోగ్యప్రదాత అయిన సూర్యదేవుడికి ప్రార్థించి ప్రత్యేకపూజలు, వివిధ ఆశనాలతో కార్యక్రమం నిర్వహించారు. క్షీరాన్నం నివేదించి భక్తులకు పంపిణీ చేశారు.

సచివాలయ భవనం ప్రారంభం

తొండంగి, ఫిబ్రవరి 18: కొమ్మనాపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి దాడిశెట్టి రాజా ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, ఎంపీడీవో పసుపులేటి సతీష్, గాబురాజు, సర్పంచ్ కోన అమ్మాజీ సూర్యనారాయణ, మార్కెట్‌యార్డ్ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళీ ఉన్నారు.

నూకాలమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ

తుని రూరల్, ఫిబ్రవరి 18: ఎస్.అన్నవరం గ్రామదేవతగా పూజలందుకుంటున్న నూకాలమ్మ ఆలయ, విగ్రహ పునఃప్రతిష్ఠ ఆదివారం శాస్త్రోక్తంగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు, మంత్రి దాడిశెట్టి రాజా దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహా అన్నదానం జరిగింది.

భీష్మ ఏకాదశికి సర్వం సిద్ధం

రౌతలపూడి, ఫిబ్రవరి 18: ఈ నెల 20న భీష్మఏకాదశికి రౌతులపూడిలో శివాలయంలో సర్వం సిద్ధం చేశారు. ఆలయం ముందు చలువ పందిరి వేసారు. ఉమారామలింగేశ్వర స్వామి కల్యాణం కోసం ఆదివారం మహిళలు పసుపు దంచారు. మంగళవారం అన్నదానం, స్వామివారి రథోత్సవం, కల్యాణం ఉంటుందని ఆలయపూజారి సుబ్రహ్మణ్యం చెప్పారు.